క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం సుందరి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 145 మందికి 2012 బ్యాచ్ విద్యార్థులు బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఏటా క్రమం తప్పకుండా పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో అవసరమయ్యే విధంగా పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పసుపులేటి మెహర్‌సుజాత, రెడ్డి వెంకటరావు, అద్దంకి గోవిందరాజు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని పాఠశాలల్లో చిన్నారులను చేర్పొద్దు

రామచంద్రపురం రూరల్: వచ్చే విద్యా సంవత్సరంలో అనుమతుల్లేని పాఠశాలల్లో తమ చిన్నారులను చేర్పొద్దని రామచంద్రపురం మండల ఎంఈవో మానుపూడి శ్రీనివాస్ బుధవారం హెచ్చరించారు. బుధవారం ఎంఈఓ విలేకరులతో మాట్లాడుతూ ద్రాక్షారామలోని శ్రీచైతన్య, రామచంద్రపురం పట్టణంలోని రత్నంపేటలో ఉండే వివేకానంద పాఠశాలలకు ఎటువంటి ప్రభుత్వ గుర్తింపులు లేవన్నారు. అందువల్ల తమ పిల్లలను ఎవరూ ఆ పాఠశాలల్లో చేర్చవద్దని, గుర్తింపు ఉన్న పాఠశాలల్లో మాత్రమే చేర్చాలని సూచించారు.

ముగిసిన విద్యా పరిరక్షణ శత చండీ మహాయాగం

రామచంద్రపురం రూరల్: మండలంలోని అంబికపల్లి అగ్రహారం రాజారత్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న విద్యా పరిరక్షణ శత చండీ మహాయాగం బుధవారంతో ముగిసింది. 30 మంది వేద పండితుల నేతృత్వంలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, మండప ఉద్వాసన, మహా సంప్రోక్షణ, వేదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. వారం రోజుల పాటు కోనసీమ జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, వేల సంఖ్యలో భక్తులు మహాయజ్ఞంలో పాల్గొన్నారు. సుమారు 3 వేల మందికి అన్నసమారాధన జరిగింది.

శ్లాబ్ నిర్మాణ పనుల పరిశీలన

కపిలేశ్వరపురం: తాతపూడిలో వెల్‌నెస్ సెంటర్ శ్లాబ్ నిర్మాణ పనులను పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు బుధవారం పరిశీలించారు. స్లాబ్ ఐరన్ కట్టుబడి పనులు పూర్తయ్యాయని గురువారం శ్లాబ్ పోత పనులను చేపడతామని రాఘవులు తెలిపారు. రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మితమవుతున్న భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించేందుకు కృషి చేస్తున్నట్టు రాఘవులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్ తెలిపారు.

నెలపర్తిపాడులో పొలంబడి



నెలపర్తిపాడులో రైతులకు పొలంబడిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం కోసం ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయాన్ని పండగ చేసే క్రమంలో రైతులకు మేలు చేసే 4 పొలంబడి సూత్రాలను గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు టి.శ్రావణి, సర్పంచ్ రాయుడు సీతామహాలక్ష్మి, రాయుడు వీర్రాజు, రైతులు పాల్గొన్నారు.

129 మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా అంగర పీహెచ్‌సీ డాక్టర్ జె.అనూజ ప్రియాంక బుధవారం తాతపూడిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యురాలు జుత్తుక వెంకటలక్ష్మి సందర్శించారు. గ్రామానికి చెందిన 129 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో అనూజ ప్రియాంక మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామని, వృద్ధులకు బీపీ, షుగర్, పరీక్షించి మందులను అందజేశామన్నారు. హెచ్ఈ బి.రామారావు ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి కె.దీప్తి, ఆరోగ్య కార్యకర్తలు తోట రామకృష్ణ, ఎం.దేవి, 104 సిబ్బంది ప్రసాద్, రాజు ఆశ కార్యకర్తలు సేవలందించారు.

ఇందిరమ్మ కాలనీకి మహర్దశ

- జగనన్న కాలనీతో పాటు మౌలిక వసతులు
- రూ.28 లక్షలతో శరవేగంగా అభివృద్ధి పనులు
- పాలతోడు ఇందిరమ్మ కాలనీ వాసుల హర్షం



కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి తదితరులు

మండపేట: కనీస వసతులు కరవై ఏళ్ల తరబడి ఇందిరమ్మ కాలనీ వాసులు పడుతున్న వెతలకు జగనన్న కాలనీ చెక్ పెట్టింది. పాత కాలనీలో అభివృద్ధి పనులకు మార్గం సుగమం చేసింది. దశాబ్దంన్నర కాలంగా ఎందరో పాలకులను వేడుకున్నా జరగని పనులు నెలల వ్యవధిలోనే జరగడంపై కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పేదల ఇళ్ల స్థలాల కోసం పాలతోడు గ్రామంలోని పంట కాలువ సమీపంలో మూడు ఎకరాలు సేకరించారు. అప్పట్లో సుమారు 30 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఆయన అకాల మరణంతో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు సమకూర్చలేదు. తర్వాత వచ్చిన పాలకులు కాలనీ వైపు కన్నెత్తి చూసింది లేదు. అధ్వానంగా ఉన్న కాలువ గట్టు, కనీస వసతులు కరవై చుట్టూ తుప్పలు, పొదలు మధ్య తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేదని కాలనీవాసులు తెలిపారు. విద్యుత్తు లైన్లు అంతంతమాత్రమేనని, గాలివానలకు రోజుల తరబడి అంధకారంలోనే మగ్గాల్సి వచ్చేదన్నారు. వర్షాకాలంలో కాలనీలో జీవనం మరింత దుర్భరంగా ఉండేదని వివరించారు.

జగనన్న కాలనీతో మోక్షం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పేదలందరికీ ఇళ్లు పథకంలో పాలతోడులోని ఇందిరమ్మ కాలనీని ఆనుకుని ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో దాదాపు 50 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇళ్ల నిర్మాణంతో పాటు జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ పంచాయతీ సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు దంపతులు ఇందిరమ్మ కాలనీవాసుల వెతలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు. జగనన్న కాలనీతో పాటు ఇందిరమ్మ కాలనీలో వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. రూ.20 లక్షల వ్యయంతో కాలనీకి వెళ్లే కాలువ గట్టు రోడ్డును అప్రోచ్ రోడ్డుగా, కాలనీలో అంతర్గత రోడ్లను మెటల్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. అలాగే రూ. 8 లక్షల వ్యయంతో పంట బోదెపై రెండు కల్వర్టులు నిర్మించారు. విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో ప్రతి వీధిలోనూ విద్యుత్‌లైన్లు, లో ఓల్టేజీ సమస్య లేకుండా టాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రూ. 13 లక్షల వ్యయంతో వాటర్ పైప్‌లైన్ పనులకు ప్రతిపాదనలు పంపారు. అలాగే డ్రైన్ల నిర్మాణానికి కూడా చర్యలు చేపడతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎంతోమంది నాయకులు, అధికారులను వేడుకున్నా జరగని అభివృద్ధి కేవలం నెలల వ్యవధిలో జరగడంతో ఇందిరమ్మ కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం పాలతోడు సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, అరవరాజు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు గంగరాజు దేవి తదితరులు పరిశీలించారు. కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టడంతో స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ గుత్తుల సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు పిల్లా సూరిబాబు, తుమ్మా వీరబాబు, ఈఓ ఎస్‌వీ రామారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోట సహకారంతో



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో కాలనీల్లోను, గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఏ సమస్యనైనా ఆయన దృష్టికి తీసుకువెళితే వెంటనే స్పందిస్తున్నారు. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నారు.

–పిల్లా వెంకటలక్ష్మి, సర్పంచ్, పాలతోడు

మా వెతలు తీర్చారు



ఎన్నో ఏళ్లుగా కాలనీలో నివసిస్తున్నాం. కనీస వసతులు లేక దుర్భర జీవనం సాగిస్తున్నాం. వర్షాకాలంలో నడలేని పరిస్థితి ఉండేది. నెల రోజుల్లోనే కాలనీలో రోడ్లు, కల్వర్టులు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి మా కష్టాలు తీర్చారు.

–యు.అప్పయమ్మ, కాలనీవాసి, పాలతోడు

'శ్రమ'తో హైస్కూళ్లలో డిజిటల్ ల్యాబ్‌లు

రూ.30 లక్షల వ్యయంతో మూడు ల్యాబ్‌ల ఏర్పాటు



కపిలేశ్వరపురం జెడ్పీ హైస్కూల్లో ల్యాబ్ పరికరాలను అమర్చిన శ్రమ సంస్థ ప్రతినిధులు

కపిలేశ్వరపురం: శాస్త్రీయ అధ్యయనానికి సైన్స్, డిజిటల్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. తరగతి గదిలో ఉపాధ్యాయుడు ద్వారా నేర్చుకున్న పాఠ్యాంశాన్ని ల్యాబ్‌లో ప్రయోగాత్మక ప్రయత్నంతో నిర్ధారణ చేసుకోవడం ద్వారా పాఠ్యాంశంలోని శాస్త్రీయత నిరూపితమవుతుంది. నిర్ధారణ, నిరూపణలకు ఉపయోగపడే ల్యాబ్‌లను పేద, మధ్య తరగతి ప్రజలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకు సమకూర్చాలన్న లక్ష్యంతో ఆలమూరుకు చెందిన శ్రమ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. వారి కృషితో సన్ ఫౌండేషన్, క్రై సంస్థల సంయుక్త సౌజన్యంతో కపిలేశ్వరపురం మండలంలోని మూడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రూ.30 లక్షల విలువైన సైన్స్, డిజిటల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. శ్రమ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.శేషగిరిరావు ల్యాబ్‌ల ఏర్పాటు తాలూకు వివరాలను బుధవారం వెల్లడించారు.

మండలంలోని కపిలేశ్వరపురం, నల్లూరు, వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ల్యాబ్ ఇన్‌స్టలేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. పాఠశాలలోని ప్రత్యేకమైన గదిని ల్యాబ్‌గా సుందరంగా తీర్చిదిద్దారు. సైన్స్ అంశాలను, శాస్త్రవేత్తల జీవిత విశేషాలతో వారు సాధించిన, నిరూపించిన శాస్త్రీయ అంశాలను వివరించే డిస్ప్లే ల చార్టులు నాలుగు గోడలకు అమర్చారు. మానవ శరీర భాగాలపై అవగాహన పెంచే బొమ్మలను ఏర్పాటు చేశారు. డిజిటల్ పాఠాల అధ్యయనానికి, సమాచారాన్ని సేకరించేందుకు కంప్యూటర్ అందజేశారు. ల్యాబ్‌లో సైన్స్ ప్రయోగ పరికరాలు, రీడింగ్ టేబుల్, కుర్చీలను విద్యార్థుల సౌకర్యం కోసం అందుబాటులో ఉంచారు. నిర్వాహకులు జె.శేషగిరిరావు, కో–ఆర్డినేటర్ నాగేశ్వరి, మాట్లాడుతూ దాదాపు ల్యాబ్‌ల ఇన్‌స్టలేషన్ ప్రక్రియ పూర్తవుతుందని, ఈ నెల 18న పాఠశాలలకు స్వాధీన పరుస్తామని తెలిపారు.

ఉగాది లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



యనమదలలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శాంతి

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఉగాది లోపుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం డివిజన్ డీఎల్‌డీఓ ఎ.శాంతి అధికారులకు సూచించారు. ఆమె బుధవారం మండలంలోని యనమదలలో నిర్మిస్తున్న ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారుల నుంచి ఎటువంటి సహకారం అవసరమైనా తీసుకుని నిర్మాణాలు వేగవంతం చేసుకోవాలని లబ్ధిదారులను తెలిపారు. అదే విధంగా లబ్ధిదారులకు అవసరమైన అన్ని సహకారాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, పంచాయతీ కార్యదర్శి కేవీ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు పెట్టే పనికి ఫెన్సింగ్‌తో అడ్డుకట్ట



అంగర హైస్కూల్ వద్ద ఫెన్సింగ్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల వెనుక భాగాన గల టేకి డ్రెయిన్ గట్టుపై స్థానికులు చెత్తను డంప్ చేస్తున్నారు. భారీగా పేరుకుపోయినపుడు చెత్తకు నిప్పు పెడుతుండడంతో పాఠశాల వైపు పొగ ఎగబాకుతోంది. దీంతో విద్యార్థులు తరచూ అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు పాఠశాల సమీపాన జగనన్న కాలనీని ఏర్పాటు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. చెత్తకు నిప్పుపెడుతుండడంతో భవిష్యత్తులో కాలనీ వాసులకు సైతం సమస్య అవుతుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ పాలకవర్గం డంపింగ్ ప్రదేశంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు సంబంధిత స్థలాన్ని బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సందర్శించి విద్యార్థుల శ్రేయస్సు కోసం ఫెన్సింగ్ వేసే నిర్ణయం అత్యవసరమన్నారు. కొబ్బరికాయ కొట్టి ఫెన్సింగ్ నిర్మాణ పనులను ప్రారంభించారు.

పనుల వేగవంతానికి సహకరించండి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశతో భేటీ



ఇళ్ల నిర్మాణంపై లక్ష్మీషాతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల పనుల వేగవంతానికి సహకరించాలని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. తాడేపల్లిలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఎండీ లక్ష్మీషాతో ఎమ్మెల్సీ తోట భేటీ అయ్యారు. నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఆయనతో సమీక్షించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా మండపేట నియోజకవర్గంలో 9,500 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్తు లైన్లు ఏర్పాటు వంటి వసతుల కల్పన పనులు వేగవంతం చేయాలని కోరారు. సకాలంలో బిల్లులు విడుదలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తోట కోరారు. ఆయా అంశాలపై లక్ష్మీశ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ తోట తెలిపారు. వైఎస్సార్ సీపీ నేత గారపాటి అశోక్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, రూరల్ హౌసింగ్ ఏఈ దాసు తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేఏవై సర్వేలో సిబ్బంది నిమగ్నం



పడమర ఖండ్రికలో వృద్ధురాలి వివరాలు నమోదు చేస్తున్న అంగర పీహెచ్‌సీ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: వైద్య ఆరోగ్య శాఖ అంగర పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది పీఎంజేఏవై సర్వేలో నిమగ్నమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన (పీఎంజేఏవై)కు అర్హులను గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. పీహెచ్‌సీలోని వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల వారీగా ప్రణాళికాబద్ధంగా నిర్దేశించిన నివాసాలకు వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నారు. వైద్యాధికారులు పి.రత్నకుమారి, జె.అనూజ ప్రియాంక మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు డేటా ఆధారంగా పీఎంజేఏవై సర్వే చేస్తున్నామన్నారు. పథకంలో అర్హులకు రూ.5 లక్షలు ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు.

పొలంబడిలో రైతులకు సూచనలు



పలివెల పొలంబడిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ వెంకటరామారావు

కొత్తపేట: ప్రస్తుత రబీ సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పలివెలలో రెండు ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ వెంకటరామారావు పలువురు రైతులకు చెందిన వ్యవసాయ క్షేత్రాల్లో తిరిగి వరి పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇకపై వరి సాగులో తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంట పాలు పోసుకునే దశలో ఉన్నందున, నీరు ఉండేలా చూసుకోవాలన్నారు. అగ్గితెగులు, కాండం కుళ్లు తెగులు రాకుండా సూడోమోనాస్, వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. వాటిని 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సీహెచ్ సాగర్, ఎన్.సురేఖ పాల్గొన్నారు.

విశ్వేశ్వరాయపురంలో..

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పొలం పరిసరాల విశ్లేషణ, మిత్ర, శత్రుపురుగులపై అవగాహన, ప్రకృతి వ్యవసాయంపైన అధికారులు అవగాహన కల్పించారు. ఆత్మ జిల్లా పీడీ జ్యోతిర్మయి, జిల్లా రిసోర్స్ సెంటర్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్, వ్యవసాయ అధికారి మనోహర్, ఏఏపీ ఛైర్మన్ నల్లి శివకుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.రాకేష్, వీఏఏ థెరిసా, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మండపేటలో 98 మంది విద్యార్థుల గైర్హాజర్
- నేడు సెకండియర్ విద్యార్థులకు పరీక్ష



మండపేటలో పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థినులు



రాయవరం పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు నంబర్లు చూసి, గదులు చూపిస్తున్న అధ్యాపకురాలు



కాజులూరు పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మండపేట: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఆదిత్య, ఎంపీఎస్, విజ్ఞాన్, విద్యావికాస్, శ్రీవైష్ణవి ఒకేషనల్ కళాశాలల్లో తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 1,688 మంది, ఒకేషనల్ విద్యార్థులు 415 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా జనరల్ విద్యార్థులు 40 మంది, ఒకేషనల్ విద్యార్థులు 58 మంది మొత్తం 98 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. కాగా గురువారం జరగనున్న సెకండియర్ పరీక్షకు జనరల్ విద్యార్థులు 1,524 మంది, ఒకేషనల్ విద్యార్థులు 506 మంది హాజరు కానున్నారు.

రాయవరం మండలంలో 16 మంది గైర్హాజర్

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. తొలి పరీక్ష కావడంతో విద్యార్థులు టెన్షన్‌గా ఫీలవడం కన్పించింది. గతేడాది పరీక్ష కేంద్రాన్ని ఇక్కడ విద్యార్థులకు రామచంద్రపురంలో కేటాయించారు. ఈ ఏడాది కళాశాలను స్థానిక ఉన్నత పాఠశాలలోకి మార్చడంతో ఈ ఏడాది రాయవరం, బిక్కవోలు మండలాల విద్యార్థులకు ఇక్కడే పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు చెందిన 321 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 305 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డీవీవీ నాగేశ్వరరెడ్డి, డీవో డి.రమేష్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం మొదటి రోజున ప్రశాంతంగా జరిగాయి. రామచంద్రపురం పట్టణంలో అయిదు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాలైన వికాస్ జూనియర్ కళాశాలలో 381 మంది విద్యార్థులకు 11 మంది పరీక్షకు హాజరు కాలేదు. 370 మంది పరీక్షలు రాశారు. వీఎస్ఎం పరీక్ష కేంద్రంలో 489 మందికి 465 మంది పరీక్షకు హాజరు కాగా మిలిగిన 24 మంది డుమ్మా కొట్టారు. మోడరన్ కేంద్రలో 410 మందికి 385 పరీక్ష రాయగా, 25 మంది హాజరు కాలేదు. నారాయణ పరీక్ష కేంద్రంలో 293 మందికి 286 మంది హాజరు కాగా ఏడుగురు రాలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 410 మందికి 380 మంది పరీక్ష రాయగా 30 మంది హాజరు కాలేదు. మొత్తంగా 1983 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1886 మంది హాజరయ్యారు మిగిలిన వారు గైర్హాజరైనట్టు అయినట్లు అధికారులు తెలిపారు. కాగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేసి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పోలీసులు విద్యార్థుల హాల్ టికెట్లను తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి పంపించారు.

కాజులూరులో..

కాజులూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కాజులూరు పరీక్ష కేంద్రంలో స్థానిక కళాశాల విద్యార్థులతో పాటు గొల్లపాలెం కాకతీయ కళాశాల, పీఎస్ఎన్ మూర్తి కళాశాలకు చెందిన మొత్తం 580 మంది ఇంటర్ విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాస్తున్నారు. తొలిరోజు పరీక్షలలో భాగంగా 309 మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 21 మంది గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు మంచినీరు తదితర వసతి సదుపాయాలు కల్పించామన్నారు. గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమౌతాయని విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

99 శాతం పంట నమోదు

రాయవరం: ప్రస్తుత రబీలో మండలంలో 14,561 ఎకరాల్లో రైతులు వరి సాగు చేసినట్టు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 4 వరకూ మండలంలోని 14,519 ఎకరాల్లో 99 శాతం మేర పంట నమోదు జరిగిందన్నారు. ఈ నెల 10న మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల వద్ద పంట నమోదు ముసాయిదా జాబితాలను ప్రదర్శించామన్నారు. ఆజాబితాను ఈ నెల 13 నుంచి 17 వరకు సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శిస్తున్నామన్నారు. ముసాయిదా జాబితాపై గ్రామ సభలు నిర్వహించబడతాయని, గ్రామ సభలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల వివరాలను చదివి విన్పిస్తారన్నారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే సవరణ కోసం రైతు భరోసా కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. సవరణల అనంతతరం తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు చేయబడవని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన తెలిపారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో ఆర్యావటం కోళ్లతూము సెంటర్‌లో బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కరప, కాజులూరు మండలాల్లో 20 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌కు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు వచ్చి ఆటో, బస్సులెక్కుతుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయాల్లో వీరికి సరైన షెల్టర్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. షాపుల అరుగుల పైనా దుకాణాల ఎదుట నిలిచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ సెంటర్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉప్పునీటి అక్రమ రొయ్యల చెరువుల పరిశీలన



కె.గంగవరంలో అక్రమ చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలో 12 ఎకరాల్లో పర్వతని సుబ్బారావు అక్రమంగా సాగు చేస్తున్న ఉప్పునీటి రొయ్యల చెరువులను బుధవారం అధికారుల పరిశీలించారు. ఈ నెల 12న అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో ఇచ్చిన స్పందన ఫిర్యాదుపై మత్స్యశాఖ ఎఫ్‌డీఓ డేవిడ్‌రాజు గ్రామ రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఎస్సీ పేట పెద్దలు అధికారులకు అక్రమ చెరువుల వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, చింత రాజారెడ్డి, స్థానిక పెద్దలు కాలకూరి లెనిన్ బాబు, పువ్వల ఈశ్వరరావు, ముడే గణేష్, కాలకూరి భానుచందర్, కాశీ సంధ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలకు పందిరిరాట

రావులపాలెం: స్థానిక సీతారామచంద్రస్వామి, షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలకు బుధవారం పందిరిరాట వేశారు. ఆలయ అర్చకుడు పాణింగపల్లి జనార్దన కేశవమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించగా గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పందిరిరాటను పాతారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, సీఆర్‌సీ ఓల్డేజ్ హోం అధ్యక్షుడు సత్తి రామకృష్ణారెడ్డి, పోతంశెట్టి కనికిరెడ్డి, కర్రి సత్తిరెడ్డి, సత్యానారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

నాణ్యత, పరిమాణం విషయంలో మోసపోవద్దు



కొత్తపేట డిగ్రీ కళాశాలలో ఆదిత్యకిరణ్‌ను సత్కరిస్తున్న అరుణ్‌కుమార్

కొత్తపేట: వినియోగదారులు మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు ఆ వస్తువుల నాణ్యత, పరిమాణం, ధర విషయంలో మోసపోకుండా స్పృహ కలిగి ఉండాలని జిల్లా జిల్లా కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఇన్‌చార్జ్, ప్రైస్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్ సూచించారు. బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఎకనామిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆదిత్యకిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా సేవలందిస్తున్న ఆదిత్యకిరణ్‌ను కళాశాల తరఫున సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపేట, అంబాజీపేట మండలాల వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.